నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
3 | కరీంనగర్, గురువారం 29 ఫిబ్రవరి 2024 | PEDDAPALLI

# కదిలిన ఇసుక లారీలు

నమస్తే ఎఫెక్ట్

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ముత్తారం, ఫిబ్రవరి 28: ఓడేడు, మంథని మెయిన్‌రోడ్డుపై నిలిపి ఉన్న ఇసుక లారీలను తొలగించారు. 'నమస్తేతెలంగాణ'లో 'రోడ్లపైనే ఇసుక లారీలు' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి టీఎస్ఎండీసీ అధికారులు స్పందించారు. రాకపోకలకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ముత్తారం, ఓడేడు ఇసుక రీచ్‌ల్లో ఆన్‌లైన్ క్వాంటిటీని నిలిపివేశారు. దీంతో రోడ్డుపై ఉన్న వందలాది ఇసుక లారీలు క్లియర్ అవుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు తమ సమస్యలను కండ్లకు కట్టినట్లు వెలుగులోకి తెచ్చిన 'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపారు.

# మంథని సీడీపీవో సరెండర్

- ఇన్‌చార్జి సీడీపీవో కూడా..
- మరో సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీస్
- తాజాగా పెద్దపల్లి కలెక్టర్ ఉత్తర్వులు
- విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడమే కారణం

మంథని, ఫిబ్రవరి 28: విధులు, సేవలను సక్రమంగా నిర్వహించని ఐసీడీఎస్ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. తాజాగా మంథని సీడీపీవో పద్మశ్రీ, ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితను సరెండర్ చేశారు. మరో సూపర్‌వైజర్ సరితకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొద్దిరోజులుగా మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతోపాటు కలెక్టర్, ఆ శాఖ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 22న డీడబ్ల్యూవో, 26న రీజినల్ జాయింట్ డైరెక్టర్ మంథని ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ చేశారు. అనంతరం నివేదికను కలెక్టర్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు. ఆ మేరకు విధులు, సేవలు సక్రమంగా నిర్వర్తించడం లేదని సీడీపీవో పద్మశ్రీని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు, విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు కార్యాలయ సమాచారాన్ని బహిర్గతం చేసిందని ఇన్‌చార్జి సీడీపీవో బండ రజితను వరంగల్ ఆర్‌జేడీ కార్యాలయానికి సరెండర్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా ఇన్‌చార్జి సీడీపీవోకు సహకరించిందని పేర్కొంటూ గుంజపడుగు సెక్టార్ సూపర్ వైజర్ గండు సరితకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అదే విధంగా మంథని ఇన్‌చార్జి సీడీపీవోగా రామగుండం సీడీపీవో స్వరూపారాణికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టాలి

బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ)/ గంభీరావుపేట: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను తెలుపుతూ పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ రూపొందించిన కరపత్రాన్ని బుధవారం ఆయన సిరిసిల్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ నాటకం ఆడుతున్నదని, కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చే కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను తొలగించి మరమ్మతులు చేసి, ప్రాజెక్టును పునరుద్ధరించాల్సిన ప్రభుత్వం అసత్య ఆరోపణలతో బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రపంచంలోనే నంబర్ వన్‌గా పేరు గాంచిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన చిన్న చిన్న లోపాలను భూతద్దంలో చూపిస్తూ ప్రాజెక్టు ప్రతిష్టను మంటగలుపుతుందని మండిపడ్డారు. ఓట్ల కోసం రైతుల నోట్లో మట్టి గొట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజనిజాలను ప్రజలకు వివరించేందుకు మార్చి ఒకటిన చలో కాళేశ్వరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మంథని మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ కాళేశ్వరంపై వాస్తవాస్తవాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రం చదివితే పూర్తిగా అవగతమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సాగిస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలకు కూలంకషంగా వివరించి తిప్పికొట్టాలని సూచించారు.



సిరిసిల్లలో ర్యాలీగా వస్తున్న పవర్‌లూం కార్మికులు, ఆసాములు, సీఐటీయూ నాయకులు

# వస్త్రపరిశ్రమను ఆదుకోండి

- తక్షణమే బతుకమ్మ చీరెలు, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలి
- పెండింగ్ బకాయిలు, సబ్సిడీ నగదు అందించాలి
- కార్మికులు, ఆసాముల డిమాండ్
- సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్లలో 'నేతన్నల ఆకలి కేక' మహాధర్నా

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : సిరిసిల్లలో ఆసాములు, కార్మికులు కదం తొక్కారు. తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్, ఆసాముల సమన్వయ కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో 'నేతన్నల ఆకలి కేక' పేరిట బుధవారం నిర్వహించిన మహాధర్నాకు పెద్దసంఖ్యలో ర్యాలీగా తరలివచ్చి, అంబేద్కర్ చౌక్‌ను దిగ్బంధించారు. గంటపాటు అక్కడే ధర్నా చేశారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించాలని, తక్షణమే బతుకమ్మ చీరెలు, ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవాలని, పెండింగ్ బకాయి లు, సబ్సిడీ నగదును అందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ సర్కారు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రూ. కోట్ల విలువైన వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి, కార్మికులకు చేతినిండా పని కల్పించదని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోయిందని విమర్శించారు. టెస్కోకు ₹480 కోట్లు చెల్లించకపోవడమే కాకుండా జనవరిలో ఇవ్వాల్సిన బతుకమ్మ చీరెలు, ప్రభుత్వ రంగ సంస్థల ఆర్డర్లు ఇవ్వక పోవడంతో యజమాన్యం పరిశ్రమను మూసి వేసిందని చెప్పారు. దీంతో పవర్‌లూం కార్మికులు, ఆసాములు, వైపని, వార్పిన్, గుమాస్తాలు, జాఫర్లు, అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన చెందారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని, జాతీయ టెక్స్‌టైల్ బోర్డును, ఇతర పథకాలను రద్దు చేసి కార్మికుల బతుకులపై ఉక్కుపాదం మోపిందని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ఎంపీ బండి సంజయ్ తన నియోజకవర్గం పరిధిలో ఉన్న కార్మికుల సమస్యలపైన గానీ, టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి కోసం గానీ పార్లమెంటులో ఒక్కసారైనా నోరు మెదపకపోవడం సిగ్గు చేటన్నారు. బీజేపీకి మత రాజకీయాలు తప్ప, ప్రజల ప్రయోజనం అవసరం లేదని విమర్శించారు. సాంచాల సంక్షోభ నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బతుకమ్మ చీరెలు, విద్యార్థుల యూనిఫాంలు, ప్రభుత్వ, ప్రభుత్వ రంగాలకు సంబంధించిన ఇతర వస్త్రాల ఉత్పత్తుల ఆర్డర్లు కార్మికులకు ఇప్పిస్తే 365 రోజులపాటు నిరంతరాయంగా ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే మన రాష్ట్రంలోని కార్మికుల ద్వారా ఉత్పత్తి చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, సీఐటీయూ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి, కార్యదర్శి చేరాల అశోక్, సహాయ కార్యదర్శి మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డీ జనార్దన్ తెలిపారు. హైదరాబాద్‌లోని బోయినపల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆదిలాబాద్ జిల్లాలోని జాతర్లలో బాలుర మోడల్ స్పోర్ట్స్ స్కూల్, ఉట్నూర్ బాలుర పాఠశాల, అసిఫాబాద్‌లోని బాలికల పాఠశాలలో, కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని బాలుర పాఠశాల, కాచనపల్లిలోని బాలికల గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏండ్లలోపు వయస్సు ఉన్న గిరిజన విద్యార్థులు డీటీడబ్ల్యూవో, కరీంనగర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 4 నుంచి 6 దాకా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు, జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా దేహదారుఢ్య పరీక్షలు ఉంటాయని, వివరాలకు 9059175379 నంబర్‌లో సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# మీకు అండగా ఉంటా.. జీవితాలకు బాసటనవుతా


పెద్దూరులో దుబాయ్ జైలు బాధిత వ్యక్తులు, వారి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

- స్వరాష్ట్రంలో అనేక ఉపాధి అవకాశాలు సృష్టించాం
- ఇక్కడే కుటుంబాలతో సంతోషంగా ఉండాలి
- కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన మాటను నిలుపుకోవాలి
- గల్ఫ్ బాధితులను ఆదుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్
- పెద్దూర్‌లో దుబాయ్ జైలు బాధితులకు పరామర్శ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 28: గల్ఫ్ బాధితులకు అండగా ఉంటానని, వారి ఉపాధికి వ్యక్తిగతంగా సాయం చేస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. స్వరాష్ట్రం వచ్చిన తర్వాత పదేండ్లలోనే అనేక ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. ఎక్కడికో పోయి ఇబ్బందులు పడే కంటే, ఇక్కడే ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబాలతో సంతోషంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా గల్ఫ్ బాధితులకు ఆదుకోవాలని, ఆదుకుంటామని కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని సూచించారు. దుబాయ్ జైలులో పద్దెనిమిదేండ్లు మగ్గిపోయి, కోర్టు క్షమాభిక్షతో ఇటీవలే పెద్దూరుకు చెందిన శివరాత్రి మల్లేశం, రవి, కోనరావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్, మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు విడుదలయ్యారు. బుధవారం వారు తమ కుటుంబాలతో కలిసి పెద్దూర్‌లోని మల్లేశం, రవి ఇంటికి రాగా, కేటీఆర్ అక్కడకు వెళ్లి పరామర్శించారు. వారిని ఆప్యాయంగా పలుకరించి, యోగక్షేమాలను తెలుసుకున్నారు. బాధితులు వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేందుకు తనవంతుగా సాయం చేస్తానని భరోసానిచ్చారు. తాము అధికారంలో ఉన్న టైంలో కరోనా రావడంతో గల్ఫ్ పాలసీ చేయలేకపోయామని చెప్పారు. నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి, కల్లివెల్లి అయి దేశంకాని దేశంలో ఇబ్బందులు పడుతున్న కార్మికులు, సోదరులు ఆలోచించాలని, స్వరాష్ట్రంలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో భూమి ఉన్నా నాలుగైదు దశాబ్దాలుగా నీళ్లు లేక, సరైన ఉపాధి లేక భార్యా పిల్లలను విడిచి ఎంతో మంది ఎడారి దేశం పోతున్నారని, ఎన్నో ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, స్వరాష్ట్రం వచ్చిన తర్వాత పదేండ్లలోనే తెలంగాణలో వ్యవసాయం బాగైందని, ఉపాధి అవకాశాలు పెరిగాయని వివరించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో..? వారందరికీ మా సిరిసిల్లలోని నలుగురు సోదరులు, జగిత్యాలలోని ఒక సోదరుడి జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. ఈ ఐదుగురు ఓ కేసులో ఇరుక్కొని జైలు పాలయ్యారని, ఈ విషయం దివంగత జర్నలిస్టు తవుటు నాగభూషణం, కాయితి బాలు ద్వారా తనకు తెలిసిందని గుర్తు చేసుకున్నారు. 2011-12 ప్రాంతంలో తాము అధికారంలో లేమని, అయినా వారి విడుదలకు సిన్సీయర్‌గా ప్రయత్నించామని చెప్పారు. మంద బీంరెడ్డి, నారాయణస్వామితో కలిసి నేపాల్ వెళ్లి సదరు సెక్యూరిటీ గార్డు కుటుంబానికి బ్లడ్ మనీ ₹15లక్షలు కూడా చెల్లించామని చెప్పారు. పరిహారం ఇచ్చిన వెంటనే విడుదలవుతారని ఆశించామని, కానీ, దురదృష్టవత్తూ అక్కడి చట్టాల్లో మార్పుతో ఆలస్యమైందన్నారు. కానీ, వారి విడుదలకు దుబాయ్‌లోని నాయకులు, రాదారం సత్యం, జువ్వాడి శ్రీనివాసరావు, న్యాయవాది అనురాధ, అక్కడి న్యాయవాదులు ఎంతో సహకరించారని చెప్పారు. ఇంకా ఏడేండ్ల జైలు శిక్ష ఉన్నా ముందే విడుదల కావడం సంతోషంగా ఉందన్నారు. జైలు బాధితులు రవి, మల్లేశం, హన్మంతు, లక్ష్మణ్‌కు స్వాగతం పలుకుతున్నామని, ఇక్కడే ఏదో ఒక పనిచేసుకొని కుటుంబాలతో హాయిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, బొల్లి రామ్మోహన్, ఫ్యాక్స్ చైర్మన్ జీల కిషన్ యాదవ్, కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, భూక్య రెడ్యానాయక్, బీఆర్ఎస్ నేతలు గండ్ర రమేశ్‌రావు, తిరుపతినాయక్, దేవయ్య, షేక్ అలీ, నారాయణగౌడ్, లడ్డు బాయి ఉన్నారు.


దుబాయ్ జైలు బాధితులు అన్నదమ్ములు శివరాత్రి రవి, మల్లేశంను ఆప్యాయంగా పలుకరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

# మీ మేలు జన్మలో మరువం

- దేవుడి లెక్క మమ్మల్ని ఆదుకున్నరు
- మీ సాయం లేకపోతే కుటుంబాలను కండ్లచూడపోతుం
- మాజీ మంత్రి కేటీఆర్‌తో శివరాత్రి మల్లేశం, రవి కుటుంబసభ్యులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 28: 'సారు.. మీరు దేవునిలెక్క మమ్ములను ఆదుకున్నరు. మా కోసం బాగా కష్టపడ్డరు. పైసలు పెట్టిన్రు. మా కోసం నేపాల్ వెళ్లిన్రు. దుబాయ్‌కి వచ్చిన్రు. మమ్ముల్ని ఇడిపించిన్రు. మీ మేలు ఈ జన్మలో మరువం' అంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు శివరాత్రి మల్లేశం, రవి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు చెప్పారు. పెద్దూరులోని తమ నివాసానికి వచ్చిన కేటీఆర్‌ను చూసి ఉద్వేగానికి లోనయ్యారు. సంతోషంతో ఆలింగనం చేసుకున్నారు. చెమ్మగిల్లిన కండ్లతో తమ బాధలు, జైలులో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. తాము కేసులో ఇరుక్కొని చాలా కష్టాలు పడ్డామని, జైలు నుంచి ఇక బయటికి రాలేమని అనుకున్నామని, కానీ, మీ ప్రయత్నాలతో తమలో ఒక నమ్మకం ఏర్పడిందని, ఆ ధైర్యం బతికి బయటికి వచ్చామని శివరాత్రి మల్లేశం, రవి ఉద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్ సార్, కేటీఆర్ సార్ అంటే చాలా రాష్ట్రాలు, దేశాలకు చెందిన వ్యక్తులు ఇష్టపడతారని చెప్పారు. తాము ఉన్నప్పుడు జైలులో కేటీఆర్ సార్ ప్రయత్నం చేస్తున్నారని, మీకేం కాదని తోటి ఖైదీలు ధైర్యం చెప్పేవారని గుర్తు చేశారు. మీ సాయం లేకపోతే మా కుటుంబాలను తిరిగి కండ్ల చూడలేకపోయే వాళ్లమని కన్నీళ్లు కార్చారు. దీనికి కేటీఆర్ స్పందించారు. 'మీరు అదృష్టవంతులు. ఈ విషయాన్ని జర్నలిస్టు నాగభూషణం మొదట తన దృష్టికి తెచ్చారు. తర్వాత కాయితీ బాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసేవాడు. మీ కోసం కుటుంబసభ్యులు, తల్లిదండ్రులు చాలా కష్టపడ్డరు. సిరిసిల్లలో నేను ఏ కార్యక్రమానికి వచ్చినా చందుర్తికి చెందిన ఎల్లమ్మ నన్ను కలిసేది' అని గుర్తు చేశారు. తమ పద్దెనిమిదేండ్ల గల్ఫ్ జీవితం, జైలు, అక్కడ కార్మికుల పరిస్థితులపై యువతను చైతన్యం చేసేలా సినిమా తీయాలని అని మల్లేశం విన్నవించగా, 'ముందు మీ బతుకు బండి పట్టాలెక్కిన తర్వాత సినిమా గురించి ఆలోచిద్దాం' అని కేటీఆర్ సూచించారు.

### మా సిరిసిల్లేనా అనిపించింది

'పద్దెనిమిదేండ్ల తర్వాత ఇక్కడికి వచ్చారు కదా..? ఈ ప్రాంతం ఎలా ఉన్నది? ఏమనిపిస్తున్నది?' అని కేటీఆర్ ప్రశ్నించగా, 'సార్ చాలా అభివృద్ధి జరిగింది. నిజంగా మా సిరిసిల్లనేనా..?' అని అనిపించిందని మల్లేశం, రవి చెప్పారు. తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ, పదేళ్లలోనే సిరిసిల్ల రూపురేఖలు మార్చామని, ఇక్కడ వ్యవసాయ, మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలు, పెద్ద దవాఖానలు వచ్చాయని, అన్ని విధాలా అభివృద్ధి జరిగిందన్నారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి పనిచేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో వరి నాట్లకు సైతం వలస వస్తున్నారని తెలిపారు. 'మనవాళ్లు ఇక్కడే పని చేసుకుంటే బాగుంటుంది? కదా.. గల్ఫ్‌లో బాధలు ఎలా ఉంటాయో..? మీరు ఇక్కడి కుటుంబాలకు వివరించాలి' అని సూచించగా, సార్ తప్పకుండా చెప్తామని వారు పేర్కొన్నారు. ఇంకా మీలా ఎంత మంది ఉన్నారని కేటీఆర్ వారిని అడుగగా, నిజామాబాద్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల వారు ఉన్నారని మల్లేశం చెప్పారు. ప్రభుత్వం నుంచి అందే సాయంతోపాటు వ్యక్తిగతంగా తాను రెండు, మూడు నెల్లలో సాయం అందిస్తానని భరోసానిచ్చారు. ఇంకా అక్కడ ఉన్న వారి కోసం పెద్దసారు కేసీఆర్, నేను, పార్టీ అంతా ప్రయత్నం చేస్తామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా చూస్తామన్నారు.

# అధికారం కోసం దిగజారుతారా..?


- జీవన్ రెడ్డి.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా..
- మీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు విప్ ఎందుకు జారీ చేయలేదు
- పదవుల కోసం పార్టీలు మారిన చరిత్ర మీదే
- బీసీలపై ఆయనది కపటప్రేమ
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ధ్వజం

జగిత్యాల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీలో అధికారం కోసం దిగజారడం ఎంత వరకు సబబని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రశ్నించారు. జగిత్యాల రూరల్ మండల పరిషత్, జగిత్యాల కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఉందని, ఎమ్మెల్యే సూచించిన వారే అధ్యక్షులు అవుతారని చెప్పి ఇప్పుడు ఇలాంటి కుట్రలకు పాల్పడుతారా..? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా..? అని మండిపడ్డారు. సిద్ధాంతాల కోసం పార్టీలు మారిన వారు ఉన్నరే కానీ, అధికారం, పదవుల కోసం పార్టీలు మారింది మాత్రం జీవన్‌రెడ్డినని విమర్శించారు. బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరించిన తొమ్మిది మంది కౌన్సిలర్లను డిస్‌క్వాలిఫై చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామని, ఆయనకు ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకమున్నా అడ్డుకోవద్దని సూచించారు. బుధవారం జగిత్యాలలోని తన క్యాంపు ఆఫీసులో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల కౌన్సిల్‌లో 48 వార్డులకు ఒక స్థానం ఖాళీ ఉందని, 47 మంది కౌన్సిలర్లు ఉన్నారని, అందులో 29 మందితో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉన్నదని చెప్పారు. అనివార్య కారణాలతో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా చేయగా, మున్సిపల్ నిబంధనల ప్రకారం వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారన్నారు. కానీ, జీవన్‌రెడ్డి బీసీలకు కేటాయించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సీట్లో ఓసీలను కూర్చోబెట్టారంటూ విమర్శలు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో మున్సిపల్ చట్టం 2020కు సవరణ చేశారని, ఈ మేరకే స్థానిక సంస్థల అధ్యక్ష స్థానాలకు ఎన్నిక నిర్వహింపజేస్తామని జీవన్‌రెడ్డి చెప్పారన్నారు. కానీ, ఇప్పుడు జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తెరవెనక కుట్ర చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ చేసినా, ఆ విప్‌ను ధిక్కరించి చైర్‌పర్సన్‌గా బరిలో నిలిచిన అడువాల జ్యోతికి కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు మద్దతుగా నిలువడం అత్యంత హేయమైన చర్య అన్నారు. జీవన్‌రెడ్డికి మొదటి నుంచి పదవి కోసం పార్టీలు మార్చే గుణం, నైజం ఉందని విమర్శించారు. ఆయన 1983లో ఎన్టీఆర్ ఆశీస్సులతో మంత్రి అయ్యారని, ఆ తర్వాత ఎన్టీఆర్‌నే గద్దె దించారన్నారు. జీవన్ రెడ్డి, ఆయన కుటుంబం అరాచక పాలనను జగిత్యాల పట్టణ ప్రజలు ఎప్పుడో తిరస్కరించారన్నారు. 2009 నుంచి జీవన్‌రెడ్డి జగిత్యాలలో మెజార్టీని సాధించకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్ కౌన్సిలర్లకు ఎందుకు విప్ జారీ చేయించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేసినా, లేక ఎన్నికకు గైర్హాజరైనా బీఆర్ఎస్ బీఫాం పొందిన అభ్యర్థి చైర్‌పర్సన్‌గా గెలిచేవారన్నారు. కుట్రపూరితంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ చేయకుండా తతంగం నడిపారని ఎమ్మెల్యే విమర్శించారు. స్థానిక సంస్థల ప్రాధాన్యత గురించి ప్రెస్‌మీట్లు పెట్టి చెప్పిన జీవన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌ల ఎన్నికల గడువు ముగిసినా ఎందుకు ఎన్నికలు నిర్వహింపజేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా జగిత్యాలలో మాత్రం ఎమ్మెల్యేగా తానే గెలిచానని, అయితే జీవన్ రెడ్డి అనుచరులు, ఆయన కుటుంబ సభ్యులు మాత్రం ఎమ్మెల్యే ఎవరైనా ఎమ్మెల్సీ చెప్పిందే నడుస్తుందని మాట్లాడడం ఎంత వరకు సబబు అన్నారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారని, ఆ సమయంలో సైతం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏటా రూ. 3కోట్లు ఇచ్చారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాత్రం ఎందుకు వివక్ష చూపుతున్నారని నిలదీశారు. నిబంధనల నేపథ్యంలో వైస్ చైర్మన్లుగా ఉన్న ఓసీలు.. ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్లుగా, ఎంపీపీలుగా వ్యవహరిస్తే బీసీలకు అన్యాయం జరిగిందని గొంతు చించుకున్నారని, అదే జగిత్యాల, రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఓసీలకు ఇవ్వడం వల్ల బీసీలకు అన్యాయం జరగడం లేదా? అని ప్రశ్నించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే బీసీ మంత్రం జపిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. జీవన్‌రెడ్డి ఏ సమావేశాలకు వెళ్లినా, సమావేశాల్లో తాను కాపుకులానికి చెందిన వాడినని చెబుతాడని, బీఆర్ఎస్ జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాపు కులానికి చెందిన సమిండ్ల వాణికి అవకాశం కల్పిస్తే, ఆమెకు వ్యతిరేకంగా ఎలా కుట్ర చేస్తారన్నారు. ఈ విషయంలో కాపు కులస్తులకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, ఉపాధ్యక్షుడు ఓల్లెం మల్లేశం, మాజీ ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ లు ఆవారి శివ కేసరి బాబు, కూసరి అనిల్, కూతురు రాజేశ్, కోరే గంగమల్లు, బొడ్ల జగదీశ్, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.


కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, నాయకులు

### తొమ్మిది మంది కౌన్సిలర్లపై ఫిర్యాదు

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరించిన తొమ్మిది మంది కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని బుధవారం రాత్రి కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషాకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల చట్టం అనుగుణంగా పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిన కౌన్సిలర్ల సభ్యత్వం రద్దవుతుందన్నారు. విప్ ధిక్కరించిన కౌన్సిలర్ల సభ్యత్వం రద్దు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా పార్టీ ఆదేశాలు, విప్ జారీ పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు.


నగరంలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజూ ప్రశాంతం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 28: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం ఇంటర్ ఫస్టియర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కరీంనగర్ జిల్లాలో 17,564 మంది విద్యార్థులకు 16,996 మంది, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 4309 విద్యార్థులకు గానూ 4125 మంది, పెద్దపల్లి జిల్లాలో 5,636 మంది విద్యార్థులకు గానూ 5323 మంది పరీక్ష రాశారు. జగిత్యాల జిల్లాలో 7,270 మందికి గాను 6945 మంది హాజరయ్యారని కలెక్టర్ యాస్మిన్‌బాషా తెలిపారు. నిమిషం నిబంధనతో విద్యార్థులు గంట ముందుగానే సెంటర్లకు చేరుకున్నారు. వెల్గటూర్ మండలంలోని ముంజంపల్లికి చెందిన మున్నాల సృష్టిత తాత రాజయ్య బుధవారం అనారోగ్యంతో మరణించాడు. తాత మృతదేహం ఇంటిలో ఉండగానే పరీక్షకు హాజరైంది.